క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

హిరమండలం: మండలంలోని పిండ్రువాడ గ్రామంలో నిర్మించిన ఉమారామలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గ్రామ ప్రదర్శన, విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, జలాదివాసం తోపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంటర్‌లో చేరండి


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హైస్కూల్ ప్లస్ (ఇంటర్) తరగతులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు జాయిన్ కావాలని ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఉర్లాంలో హైస్కూల్ ప్లస్ తరగతులు నిర్వహణకు వీలుగా నలుగురు అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు నిర్వహణకు ఏర్పాటు చురుగ్గా చేస్తున్నామన్నారు. బద్దవానిపేట, కుమ్మరిపేట, ఉర్లాం తదితర గ్రామాల్లో సోమవారం ప్రచారం చేపట్టామన్నారు.

ఖండాపు నియామకం హర్షణీయం


గోవిందరావును సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యారావు

బూర్జ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో డైరెక్టర్‌గా బూర్జ మండలం మదనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావును రాష్ట్ర ప్రభుత్వం నియామించడం హర్షణీయమని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. ఖండాపు నియామకం శ్రమ, విలువలకు దక్కిన గుర్తింపు అన్నారు. గోవిందరావు ఇంటికి సోమవారం వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ నియామకానికి కృషి చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా


ట్యాంకు ద్వారా తాగునీరు అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నంలో గత ఎనిమిది రోజులుగా ట్యాంకులతో తాగునీరు సరఫరా చేస్తున్నారు. నీలమణిదుర్గ ఉత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భారీగా ప్రజలు చేరుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరును ఉత్సవ హెడ్ కమిటీ సూచన మేరకు, అధికారులు గుర్తించిన విధులకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సోమవారం ఆస్పత్రి కూడలి, ప్రధాన రహదారి, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేశామని అధికారులు తెలిపారు. తాగునీటి సరఫరాను అధికారులతో కలిసి పనిచేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణమూర్తి తెలిపారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సరికాదు


బైక్ ర్యాలీలో పాల్గొన్న కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జలుమూరు: పేదల ఇళ్ల పట్టాల పంపిణీపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ చల్లవానిపేట నుంచి కొమనాపల్లి వరకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణచైతన్య, పార్టీ నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పేదవారికి స్వంత ఇంటి కల నెరవేరేందుకు అమరావతిలో 51 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని కృష్ణచైతన్య అన్నారు. ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, యువకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- మేనిఫెస్టోలో 98 శాతం హామీలను నెరవేర్చాం..
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: సంక్షేమ పథకాల రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలో స్పీకర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మేనిఫెస్టోలోని హామీలను ఇప్పటికే 98.7 శాతం అమలు చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా ఏపీ నిలిచిందని అన్నారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, డాక్టర్ వైఎస్సార్ జగనన్న భూమి హక్కు–భూ రక్ష పథకం (రీ సర్వే) వంటి నిర్ణయాలు చరిత్రాత్మకమైనవని అభివర్ణించారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపైన చంద్రబాబు అనుచిత వాఖ్యలు తగవన్నారు. రాజమండ్రి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో చూస్తుంటే ప్రజలందరూ నవ్వుకుంటున్నారన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ముఖ్యనాయకులు కె.వి.జి.సత్యనారాయణ, ఖండాపు గోవిందరావు, ఎస్.నాగేశ్వరరావు, కొంచాడ రమణమూర్తి, పప్పల రమేష్, జె.కె.వెంకుబాబు, డి.శ్యామలరావు, లోలుగు కాంతారావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మండల సమావేశంలో ఎంపీపీ జ్యోతిలక్ష్మి


మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతిలక్ష్మి

ఎల్.ఎన్.పేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి పనిచేయాలని ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లేక ఇబ్బంది పడుతున్నామని సిద్ధాంతం సర్పంచ్ గాది కోటేశ్వరరావు సభ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం కార్యదర్శిగా పనిచేస్తున్న జయమోహన్ పాడికి మరో నాలుగు పంచాయతీలు అదనపు బాధ్యతలు అప్పగించటంతో ఆయన విధులు నిర్వహించే సమయంలో అందుబాటులో ఉండటం లేదన్నారు. సమస్యను పరిష్కరిస్తామని సూపరెండెంట్ వంసత కుమార్ తెలిపారు. ఖరీఫ్ వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లిస్తే వారంలో విత్తనాలు సరఫరా చేయటం జరుగుతుందని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అమృత్ సరోవర్ పనులతో గ్రామాల్లోని చెరువులు బాగుపడుతున్నాయని ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి అన్నారు. దాతలు చెరువు గట్లుపై మొక్కలు నాటి, సిమెంటు బెంచీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎస్.సునీత తెలిపారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పశువైద్యాధికారి జి.కవిత, ఎంఈఓ ఎస్.శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీదీప్, పీఆర్ జెఈ భాస్కరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పరిశీలన


జగనన్న విద్యా కానుక కిట్లును పరిశీలిస్తున్న దృశ్యం

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు వీలుగా నిల్వ కేంద్రానికి వచ్చిన పుస్తకాలు, జగనన్న విద్యా కానుకలు జూన్ మొదటి వారంలో ఆయా స్కూళ్లకు తరలించాలని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ఏఎంఓ నిశిన్ అన్నారు. స్థానిక జేవీకే నిల్వ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని పుస్తకాలు వచ్చాయి, జగనన్న విద్యాకానుక కిట్లు ఎన్ని వచ్చాయనేది ఎంఈఓ శాంతారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 12న స్కూల్ ప్రారంభం నాటికి అన్ని పుస్తకాలు, జగనన విద్యా కానుక కిట్లు ఆయా స్కూళ్లకు చేరాలని సూచించారు. ఈ మేరకు ఎంఈఓలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వలంటీర్ల సేవలు భేష్


వలంటీర్లతో స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా గ్రామ, వార్డు వలంటీర్లు అందిస్తున్న సేవలు భేష్ అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదావలస మున్సిపాలిటీలోని ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో సోమవారం వలంటీర్లకు నిర్వహించిన వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వార్డు వలంటీర్లతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సన్మానం చేసి ప్రభుత్వం ద్వారా ప్రకటించిన బహుమతి మొత్తాన్ని అందజేశారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, తహసీల్దార్ గణపతిరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయ కో ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు బోర చిన్నంనాయుడు, దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు పొన్నాడ చిన్నారావు, పొదిలాపు తిరుపతిరావు, సాదు చిరంజీవి, బొడ్డేపల్లి రాజు, బొడ్డేపల్లి రమణమూర్తి, బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

31న ఇంటర్వ్యూలు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఈ నెల 31న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి సోమవారం తెలిపారు. సారవకోట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో ఖాళీగా ఉన్న 10 అంగన్‌వాడీ సహాయకులు, మినీ కార్యకర్తల పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాల్ లెటర్లు పొందినవారు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

నేడు గ్రామ వలంటీర్లకు సన్మానం

ఆమదాలవలస రూరల్: మండలంలోని గ్రామ వలంటీర్లకు ఆమదాలవలస పట్టణంలో గల ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

కాళ్లకూరికి మదర్ థెరీసా అవార్డు


అవార్డును అందుకుంటున్న కాళ్లకూరి శాంతారామ్

పొందూరు: ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి మదర్ థెరీసా అవార్డును పొందూరుకు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు కాళ్లకూరి శాంతారామ్ ఆదివారం న్యూఢిల్లీలో అందుకున్నారు. డాక్టర్ దోమన చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ ఇండియా సేవా ట్రస్టు, న్యూఢిల్లీలో ఆంధ్రా అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందించారు. శాంతారామ్ నాలుగు దశాబ్దాలుగా కళ, సేవా రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ నాగేశ్వరరావు, అవార్డు కమిటీ చైర్మన్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతలో ప్రతీ సమస్యకు పరిష్కారం


త్రైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: భగవద్గీతలో ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, ప్రతీ ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంతం –ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధి శ్రీనివాస్ కోరారు. మండలంలోని కిల్లాం, మాకివలస గ్రామాల్లో సోమవారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేపట్టారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ గూర్చి వివరించారు. ప్రతినిధులు ధన్వంతరి, రమేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఘనంగా సన్మానం


కళాకారులను సన్మానిస్తున్న ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు


ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు

పాతపట్నం: నీలమణిదుర్గ ఉత్సవాల్లో భాగంగా సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం సోమవారం రాత్రి ప్రదర్శించారు. విశ్వామిత్ర ప్రాతధారి, నంది అవార్డు గ్రహీత పెద్దింటి మోహన్‌దాస్, చంద్రమతి పాత్రధారి కిల్లారి లక్ష్మిని ఏఎంసీ ఆవరణలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యుడు లింగాల మధుబాబు, పి.రామరాజు, తిరుపతిరావు, షన్ముఖరావు పాల్గొన్నారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తులు ప్రసాదాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు పులిహోర పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు కృష్ణారావు, నేతాజీ, గుమస్తా సుదర్శన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గంగువాడ, బైదలాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి ఆలయం కూడలి బస్ సెల్టర్‌లో గంగువాడ పీహెచ్‌సీ సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలను భక్తులకు తిలకించడానికి అంతరాబ కూడలి, పంచాయతీ కార్యాలయం, మార్కెట్ యార్డు తదితదర చోట్ల ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు.

విజ్ఞానం.. వినోదం

హిరమండలం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు విజ్ఞానం,వి నోదం అందించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. బాలల హక్కు పరిరక్షణపై విశ్రాంత ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు

వ్యక్తిపై కేసు నమోదు

పొందూరు: విధులను ఆటంకపరచడమే కాకుండా దూషించినట్లు పొందూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పైల అనంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. సిస్టం కళాశాలలో సోమవారం జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న ఆర్.గవర్రాజును విధుల్లో ఉన్న కానిస్టేబుల్ అడ్డుకున్నారన్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన గవర్రాజు పరుష పదజాలంతో కానిస్టేబుల్‌ను దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అర్హతే ప్రామాణికం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన


ఆమదాలవలస: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


కొత్తూరు: నేరడిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆమదాలవలస: గత పాలన కన్నా ఈ ప్రభుత్వ పాలనలో ప్రతీ కుటుంబానికి మంచి జరిగితేనే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి అని చెప్పిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు వెంగళరావు కాలనీలో సోమవారం సాయంత్రం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటికి ఒక ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటి అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారని విమర్శించారు. ప్రజల ముందు నిలబడి సీఎం జగన్ ఒక మాట ఇచ్చారంటే ఆ మాట కోసం ఎందాకైనా వెళ్తారన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయ కో ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

కొత్తూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని నేరడి, ఎన్నిరామన్నపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. సీఎం జగనన్న అందిస్తున్న పథకాలు నేరుగా తమకే అందుతున్నాయని పలువురు మహిళలు చెప్పారు. జగనన్న పాలనలో అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, విద్యాదీవెనతో పాటు పలు రకాల పథకాల తమ బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎటువంటి లంచాలు లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం జగన్ పాలన సాగిస్తున్నందున ప్రతిఒక్కరూ అండగా ఉండాలని కోరారు. నేరడి సర్పంచ్ నక్క చిన్నమ్ముడు, ఎంపీటీసీ సభ్యురాలు బోర కమల, సర్పంచ్‌లు రత్నాలు, ఎస్.భారతి, ధర్మారావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగి నరసింహరెడ్డి, బూర్లె శ్రీనివాసరావు, మతం పూర్ణ, కామక త్రినాథరావు, నక్క వెంకటరావు, బోర లక్ష్మణరావు, కృష్ణమోహన్, గొంటి రమేష్, కె.వైకుంఠరావు, ఎల్.ఎన్.పేట, హిరమండలం మండలాలకు చెందిన పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.